నేటి దినపత్రిక
సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం | 19 ఫిబ్రవరి 2025 | పేజీలు 8

# వీఎస్‌యూ వీసీగా డా.అల్లం శ్రీనివాస్‌రావు



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వెంకటాచలం మండలం లోని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)కి వైస్ ఛాన్సలర్‌గా డాక్టర్ అల్లం శ్రీనివాస్‌రావు నియమితుల య్యారు. శ్రీనివాస్‌రావు శాస్త్రవేత్తగా, విద్యారంగంలో విశేష అనుభవం కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. యోగి వేమన విశ్వవిద్యాలయం, కడపలో ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఆయనను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వీఎస్‌యూ వైస్‌ఛాన్సలర్‌గా నియమించింది. ఈ నియామకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించగా, విద్యా వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. శ్రీనివాస్‌రావు నాయకత్వంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధి సాధిస్తుందనే విశ్వాసం వ్యక్తమవుతోంది.

### ప్రజలకు మెరుగైన

# వైద్య సేవలు అందించండి

- సీఎస్ఆర్ నిధులతో ఇందుకూరుపేట 20 పడకల ఆసుపత్రిని 50 పడకలకు అప్ గ్రేడ్
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :**

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకై ప్రభుత్వం ఖర్చు చేసే కోట్లాది రూపాయలు సార్ధకం కావాలంటే వైద్య సిబ్బంది సహకారం అవసరమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కోవూరు నియోజకవర్గానికి చెందిన జొన్నవాడ, రామ తీర్థం పీహెచ్‌సీలకు జాతీయ స్థాయిలో ఎంక్యూఎస్ (నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్) సర్టిఫికేషన్ సాధించిన సందర్భంగా డాక్టర్లు, వైద్య సిబ్బందిని ఆమె అభినందించారు. నెల్లూరు నగరం మాగుంట లే అవుట్‌లోని వీపీఆర్ నివాసంలో ఏర్పాటు చేసిన వైద్య సిబ్బంది అభినందన సభలో

-మిగతా 2లో

- శిథిలావస్థలో గట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- బిక్కు బిక్కుమంటూ.. సిబ్బంది విధుల నిర్వహణ

# ఇది.. పీహెచ్‌సీనా !




***జలదంకి, మేజర్‌న్యూస్ :***

మండలంలోని గట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రమంటే.. గతంలో ఎంతో పేరు ప్రఖ్యాతలతో ఘనకీర్తిగా ఉండేది. నేడు ఈ పీహెచ్‌సీకి వెళితే.. ఇదేమి పీహెచ్‌సీ అంటూ నోరెళ్లబెడుతున్నారు. చుట్టుపక్కల 15 గ్రామాలకు చెందిన ప్రజలకు వైద్య సేవలు అందించే ఆస్పత్రి భవనమిలా.. శిథిలావస్థకు చేరినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం విచారకరం. ఈ పీహెచ్‌సీకి వివిధ వైద్య సేవలకు వెళ్లిన రోగులే ఆందోళన వ్యక్తపరుస్తుండటం గమనార్హం. ఇక విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది పరిస్థితి ఎలా ఉంటుందో ఒకసారి ఆలోచించుకోండి. వర్షం కురిస్తే భవనమంతా జలమయమవుతోంది. ఈ సమయంలో వైద్య పరికరాలు తడవకుండా ఉండేందుకు ఫ్లెక్సీలను అడ్డం పెట్టుకొని సిబ్బంది కాలం వెల్ల దీస్తున్నారు. రోగుల కోసం ఏర్పాటు చేసిన మంచాలపై స్లాబు పెచ్చులూడి వారి మీద పడే పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో రోగులు బిక్కుబిక్కుమంటున్నారు. ఈ పీహెచ్‌సీ శిథిలావస్థకు చేరడంతో నూతన పీహెచ్‌సీ భవనాన్ని ఏర్పాటు చేసేందుకు గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో పనులు ప్రారంభమయ్యాయి. దానికి సంబంధించిన అధికారులు, కాంట్రాక్టర్లు కూడా పనులు ప్రారంభించి దాదాపు 80 శాతం మేర నూతన భవనాన్ని నిర్మించారు. చివరగా 20 శాతం ఉన్న నిర్మాణం పనులు నిలిపివేయడంతో నూతనంగా నిర్మించిన భవనం దిష్టిబొమ్మలా తయారైంది. ప్రస్తుతం ఆ భవనం మందుబాబులకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని పూర్తి చేసి ప్రారంభించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



# అందరి సహకారంతో.. 'నక్ష' విజయవంతం చేద్దాం

### నుడా చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి

***నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :***

అధునాతన డ్రోన్ సాంకేతిక విధానం ద్వారా నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న సర్వే ద్వారా ఎన్నో ఉపయోగాలున్నాయని, అధికారులు.. ప్రజాప్రతినిధులు అందరి సహకారంతో కార్యక్రమాన్ని దిగ్విజయంగా

-మిగతా 2లో



# విజేతలకు బహుమతి ప్రదానం

**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :**

నారాయణ విద్యా సంస్థల స్పోర్ట్స్‌మీట్ ఇటీవల జరిగిన నేపథ్యంలో మంగళవారం రమేష్‌రెడ్డి నగర్ బ్రాంచ్‌కు చెందిన విద్యార్థులు వివిధ రకాల క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచారు. వారికి బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఏజీఎం తిరుపతయ్య, ప్రిన్సిపాల్ కీర్తి పాల్గొన్నారు.





### బోర్డులు కూడా లేని

# వార్డు సచివాలయాలు

***నెల్లూరు టౌన్, మేజర్‌న్యూస్ :***

నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న వార్డు సచివాలయాలకు కనీసం ఆ వార్డు సచివాలయం పేర్లు తెలిపే బోర్లు కూడా అధికారులు ఏర్పాటు చేయకపోవడం విశేషం. నగరపాలక సంస్థ పరిధిలో గతంలో 167 వార్డు సచివాలయాలను అధికారులు ఏర్పాటు చేశారు. వాటిలో 166 సచివాలయాలు పనిచేస్తుండగా, ఒక వార్డు సచివాలయం ఎక్కడుందో కూడా తెలియని పరిస్థితి. నగరపాలక పరిధిలోని వార్డు సచివాలయాల్లో చాలా చోట్ల సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. కొంతమంది సెలవుల్లో ఉండగా

-మిగతా 2లో

# ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇవ్వండి

**కమిషనర్ సూర్యతేజ**



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి జంగిల్ క్లియరెన్స్ కోసం ఆయా స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ సూర్య తేజ వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా మంగళవారం స్థానిక 26వ డివిజన్ చంద్రమౌళి నగర్, వేదయపాలెం రైల్వే స్టేషన్ రోడ్డు, మోర్ సూపర్ మార్కెట్ రోడ్డు, త్యాగరాజ నగర్, పరిసర ప్రాంతాలలో కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఖాళీ స్థలాల యజమానుల వివరాలను సంబంధిత సబ్ రిజిస్టర్ వారి కార్యాలయం నుంచి సేకరించాలని, స్థలాల యజమానుల ద్వారానే జంగల్ క్లియరెన్స్ చేయించి వేకంట్ ల్యాండ్ టాక్స్ వసూలు చేయా లని ఆదేశించారు. నగర పరిధిలో ఉన్న రైల్వేట్రాక్‌కు అనుసంధానంగా పచ్చదనాన్ని పెంపొందించేందుకు, పారిశుద్ధ్య నిర్వహణ, దోమల వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైల్వే శాఖ అధికారులతో చర్చించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా డివిజన్ వ్యాప్తంగా గతం నుంచి ఫ్లోర్ పాయింట్లుగా వాడుతున్న ప్రదేశాలను గుర్తించి నగరపాలక సంస్థ హెచ్చరిక బోర్డులను ఆయా ప్రాంతాల్లో పెట్టాలని ఆదేశించారు. అన్ని డ్రైనేజీ కాలువలలో పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులు నిరంతరం జరిగేలా పర్యవేక్షించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. వీధి దీపాల సమస్య లేకుండా ప్రతి విద్యుత్ స్తంభానికి లైట్లు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట ఎక్కువ వెలుగులు ఇచ్చే హైమాక్స్ లైట్లు అమర్చాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్‌మోహన్, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ మూలాస్థానేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలి



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఈనెల 26న మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలాస్థానేశ్వరస్వామి బ్రహ్మోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని నెల్లూరు ఆర్డీవో ఎన్ఎస్ అనూష సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం మూలాపేట శివాలయ ఆవరణలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణకు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ఈనెల 21 నుండి మార్చి 5 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, 26వ తేదీ బుధవారం మహాశివరాత్రి సందర్భంగా భక్తులు విశేషంగా హాజరవుతారని, అందుకు తగ్గట్లుగా అన్ని ఏర్పాట్లు చేయవలసిందిగా కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా మున్సిపల్ శాఖ వారు శివాలయ పరిసర ప్రాంతాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచి బ్లీచింగ్, మంచినీటి సరఫరా, చలివేంద్రాల ఏర్పాటు, సైడ్ కాలువలను శుభ్రపరచుట తదితర పనులు చేయాలన్నారు. కోనేరును శుభ్రపరచడంతో పాటు ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ చేయాలని సూచించారు. అదేవిధంగా శానిటేషన్ సిబ్బందిని మూడు షిఫ్టుల్లో ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ శాఖ వారు బందోబస్తు ఏర్పాటుతోపాటు రథోత్సవం రోజున ప్రత్యేక రోప్ పార్టీని ఏర్పాటు చేయాలని సూచించారు. క్రౌడ్ మేనేజ్మెంట్‌ను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అంతరాయం లేని నిరంతర విద్యుత్ ప్రసారానికి చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. రథోత్సవం జరిగే అన్ని ప్రాంతాల్లో గుంతలు లేకుండా చూడాలని ఆర్అండ్‌బి అధికారులకు సూచించారు. ప్రాథమిక చికిత్సకు అవసరమైన అన్ని మందులతో పాటు ఎండలు ఎక్కువగా ఉన్నందున ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన కరపత్రాన్ని ఆర్డిఓ ఇతర అధికారులతో కలసి ఆవిష్కరించారు. సమావేశంలో డీఎస్పీ సింధుప్రియ, దేవాదాయ సహాయ కమిషనర్ జనార్దన్ రెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత, నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, విద్యుత్, ఆర్అండ్‌బి, ఫైర్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అందరి సహకారంతో 'నక్ష' విజయవంతం చేద్దాం

*(మొదటి పేజీ తరువాయి)*

పూర్తి చేద్దామని నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (నుడా) చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలియజేశారు. భారత ప్రభుత్వం నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ - బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్స్ (నక్ష) కార్యక్రమం అధికారిక ప్రారంభోత్సవాన్ని నెల్లూరు నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. కమిషనర్ సూర్యతేజతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించిన అనంతరం డ్రోన్ సర్వే పనితీరును సాంకేతిక విభాగం బృందాన్ని వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా 'నక్ష' కార్యక్రమం అమలు తీరు, దాని ప్రయోజనాలను నిర్వాహకులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా నుడా చైర్మన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 152 పట్టణ స్థానిక సంస్థలలో (యూఎల్‌బీ) ఏకకాలంలో 'నక్ష' నగర సర్వే ప్రారంభోత్సవ కార్యక్రమాలను ఈరోజు నిర్వహించనున్నారని తెలిపారు. అందులో భాగంగా పైలట్ ప్రాజెక్టు ప్రోగ్రాంగా నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో నగర సర్వేను నెల రోజుల పాటు నిర్వహించనున్నారని వివరించారు. అనంతరం కమిషనర్ సూర్యతేజ మాట్లాడుతూ.. నక్ష సర్వే ద్వారా పట్టణ భూమి రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేసి జీఐఎస్-మ్యాప్ చేస్తారని, నిర్మాణాత్మక, పారదర్శక డేటాను నిర్ధారిస్తారని తెలిపారు. విపత్తు నిర్వహణతో పాటు, పర్యావరణ ప్రణాళిక, స్మార్ట్ సిటీ అభివృద్ధి కోసం సర్వే ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. స్పష్టమైన, నవీకరించబడిన యాజమాన్య రికార్డుల ద్వారా భూ వివాదాలను తగ్గించడం, చట్టపరమైన ప్రక్రియలను వేగవంతం చేయడం, ఆస్తి హక్కులను మెరుగుపరచడం వంటి ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. కోర్టు కేసులు, చట్టపరమైన డాక్యుమెంటేషన్, చారిత్రక భూమి డేటా విశ్లేషణలో సర్వే వివరాలు సహాయపడతాయని, వేగవంతమైన, సమర్థవంతమైన పట్టణ ప్రణాళిక సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఖచ్చితమైన భూమి డేటాను అందించడంతోపాటు, మెరుగైన జోనింగ్ నిర్మాణం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, నగర విస్తరణను కనీస జాప్యాలతో అనుమతి




స్తుందని తెలిపారు. 'నక్ష' సర్వే నిర్వహణ ద్వారా రవాణా ప్రణాళిక, గృహనిర్మాణ ప్రాజెక్టులు, స్థిరమైన పట్టణాభివృద్ధిలో సహాయపడుతుందని, సమర్థవంతమైన విపత్తు నిర్వహణ ప్రణాళికలో ఉపయుక్తంగా ఉంటుందని కమిషనర్ వెల్లడించారు. పట్టణ స్థానిక సంస్థల పన్ను ఆదాయ సేకరణను మెరుగుపరుస్తుందని, పన్ను ఎగవేతను తగ్గిస్తుందని వివరించారు. అదనపు కమిషనర్ వైఓ నందన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తహసీన్, కార్పొరేటర్లు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, సిటీ ప్లానర్ హిమబిందు, డీసీపీ పద్మజ, మున్సిపాలిటీల కమిషనర్లు, టౌన్ ప్లానింగ్, వార్డ్ ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించండి

*(మొదటి పేజీ తరువాయి)*

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లాలో ఉన్న 58 పీహెచ్‌సీలకు గాను 2023, 2024 సంవత్సరాలలో వరుసగా కోవూరు నియోజకవర్గానికి చెందిన జొన్నవాడ, రామతీర్థం పీహెచ్‌సీలకు జాతీయ స్థాయిలో ఎంక్యూఏఎస్ (నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్) సర్టిఫికేషన్ దక్కడం గర్వంగా ఉందన్నారు. అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో వైద్య సేవలందించి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న జొన్నవాడ, రామతీర్థం పీహెచ్‌సీల పనితీరును ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ఆదర్శంగా తీసుకొని పని చేయాలని సూచించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌కు వచ్చే పేదల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ఆమె డాక్టర్లకు సూచించారు. తాను కోవూరు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక నిరంతర ఆకస్మిక తనిఖీలతో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిలో మార్పు వచ్చిందన్నారు. సీఎస్ఆర్ నిధులతో ఇందుకూరుపేట 20 పడకల ఆసుపత్రిని 50 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు ప్రకటించారు. బుచ్చి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 10 లక్షలు ఎంపీ నిధులు వెచ్చించి మార్చురీ నిర్మిస్తున్నట్టు ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో రామతీర్థం, జొన్నవాడ పీహెచ్‌సీ డాక్టర్ అమరేంద్రరెడ్డి, అహమద్ బాషా పాల్గొన్నారు.

## బోర్డులు కూడా లేని వార్డు సచివాలయాలు



*(మొదటి పేజీ తరువాయి)*

కొన్నిచోట్ల ఇన్చార్జిలే ఉన్నారు. అధికారులు ప్రజలకు ఆయా ప్రాంతాల్లో పనులు త్వరి తగతిన జరిగే విధంగా, సంక్షేమ పథకాలు అందించేందుకు వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశా రు. అయితే ప్రస్తుతం కొన్ని వార్డు సచివాలయాల్లో ఎటువంటి పనులు లేకపోవడంతో కొన్ని నిరూపంగానే ఉన్నాయి. వాటిలో అడ్మిన్లు, కొందరు కార్యదర్శులకే పనులు ఉండగా, కొంతమందికి పనులు లేక అలా వచ్చి ఇలా వెళ్ళిపోతున్నారు. కొంత మంది ఎవరి పర్యవేక్షణలో ఉన్నారో కూడా తెలియని పరిస్థితి. నగరంలో చాలాచోట్ల వార్డు సచివాలయాలు అద్దె ఇళ్లల్లో నడుస్తున్నాయి. వాటికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నెల నెలా అద్దె చెల్లిస్తుంది. కొన్నిచోట్ల అవసరం లేకపోయినప్పటికీ అధికారులు ఇష్టానుసారంగా వార్డు సచివాలయాలను ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో అక్కడ ఎటువంటి కార్యక్రమాలు లేక కొంతమంది విధులకు కూడా డుమ్మా కొడుతున్నట్లు సమాచారం. నగరపాలక సంస్థ పరిధిలోని 54 డివిజన్లో ఉన్న కొన్ని వార్డు సచివాలయాల్లో కనీసం ఆ డివిజన్ సంబంధించిన వార్డు సచివాలయం ప్రచార బోర్డు కూడా లేకపోవడం విశేషం. దీంతో పలువురు ఆయా అవార్డు సచివాలయం పేరు లేకపోవడంతో కొంత ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు వార్డు సచివాలయాలకు పూర్తిస్థాయిలో ఆయా డివిజన్లు తెలిసే విధంగా బోర్డులు ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## త్రివేణి సంగమంలో..
## పుణ్యసానం ఆచరించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

### ప్రపంచంలోనే అత్యంత గొప్ప ఆధ్యాత్మిక మహోత్సవం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ప్రయాగ్ రాజ్ మహా కుంభమేళాలో భారతదేశ ధార్మిక తేజస్సు ప్రతిబింబిస్తుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. త్రివేణి సంగమం వద్ద జరుగుతున్న 'మహా కుంభమేళా' లో ప్రత్యేక ప్రార్ధనలు చేసిన అనంతరం కుమారుడు అర్జున్ రెడ్డితో కలిసి ఆమె పుణ్యస్నానం ఆచరించారు. ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గం పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజానీకం ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని సర్వేశ్వరుడ్ని ప్రార్ధించారు. వైషమ్యాలు వీడి ప్రజలు శాంతి సౌఖ్యాలతో ఉండాలని కోరారు. త్రివేణి సంగమంలో జరిగే మహా కుంభమేళాను భారతదేశ ఆధ్యాత్మిక వారసత్వంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అభివరించారు.

# భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం ఇవ్వడంలో జాప్యం

## డీఏఓ అనిల్‌కు బీజేపీ నేత మిడతల రమేష్ విజ్ఞప్తి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నడికుడి శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం ఇవ్వడంలో జాప్యం జరుగుతుంది. గ్రామాలలో పరిహారం విషయంలో వస్తున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నెల్లూరు ఆర్డీవో కార్యాలయం డీఏఓ అనిల్‌కు బీజేపీ నేత మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. దుగ్గుంట వావింటపర్తి అంకుపల్లి పంచాయతీలలో రైల్వే లైన్ సర్వే జరిపి ఆరు సంవత్సరాలు పూర్తయింది. భూ సేకరణ మార్కింగ్ చేసి రాళ్లు నాటి నాలుగు సంవత్సరాలయింది. అర్హత పొందిన అవార్డుదారులకు పరిహారం ఇవ్వడంలో మాత్రం తీవ్రమైన జాప్యం జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం నడికుడి శ్రీకాళహస్తి రైల్వే లైన్ కొరకు అమృత భారత్ పథకం కింద నిధులు విడుదల చేసి ఉంది. వావింటపర్తిలో ఒకళ్ళిద్దరు మినహా మిగిలిన రైతులు పరిహారం తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. అయినప్పటికీ ఆర్డిఓ కార్యాలయంలో రైల్వే లైన్ పరిహార జాబితా పెండింగ్‌లో ఉండడం దురదృష్టకరం. పొదలకూరు మండలంలో కొంతమంది రైతులు తక్కువ నష్టపరిహారం వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే మార్కెట్ ధరల ప్రకారం నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని రమేష్ ప్రభుత్వం నుడిమాండ్ చేశారూ ఈ కార్యక్రమంలో అల్లి రవికుమార్ యాదవ్‌తోపాటు రైతులు పాల్గొన్నారు.

# రోప్‌జంప్‌లో జాతీయస్థాయి ప్రథమస్థాయి విద్యార్థికి అభినందనలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రోప్‌జంప్‌లో జాతీయస్థాయి ప్రథమస్థానం పొందిన పదవ తరగతి విద్యార్థి పి.మహిత్‌ను వివిద సంఘాల నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు. కలిగిరిలో ఆ విద్యార్థి 10వతరగతి అభ్యశిస్తున్నారని ఏపికాపు టీచర్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ (ఏపి కాట్వా) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమతం సుబ్బారావు పేర్కొన్నారు. మహిత్ జాతీయస్థాయిలో ప్రథమస్థానం పొంది అంతర్జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. మహిత్‌ను కాపుహెల్పింగ్ క్లబ్ తరపున కాపు నాయకులు ఊచామాల్యాద్రి, పొళ్ళకాయల చినమంజాన్, ఊచా మధు, నిశ్శంకర సురేష్, కృష్ణంశెట్టి దిలీప్, గంగిశెట్టి నరేంద్ర, ఏపికాట్వా జిల్లా అధ్యక్షుడు దోర్నాల వెంకటరామ్మోహన్, జిల్లా క్రమశిక్షణాకమిటీ కోచైర్మెన్ అడపా సూర్యప్రకాష్‌రావు, సభ్యులు చిరంజీవి, పియిటి కోచ్ బాషా తదితరులు మహిత్‌ను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. మహిత్ అంతర్జాతీయపోటీలకు వెళ్ళేందుకుగాను ఊచా మధు 3వేలరూపాయలు అందజేశారు. కాట్వా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమతం సుబ్బారావు 500 రూపాయలు అందజేశారు. ఉదయగిరి నియోజకవర్గ ప్రతినిధులు 500రూపాయలు అందజేయగా ఊచామధు ఆ విద్యార్థి షూస్‌కుగాను 1000రూపాయలు అందజేశారు. అంతర్జాతీయస్థాయిలో కూడా మహిత్ ప్రతిభ చూపి బంగారు పతకం సాధించాలని ఆకాంక్షించారు.

# చిన్నారులకు పూర్వప్రాధమిక విద్యను మెరుగ్గా అందించాలి

## మార్పులకనుగుణంగా వ్యవహరించాలి



జ్యోతిప్రజ్వలనతో శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్న ఎంఈవో, సిడిపివో

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వప్రాధమిక విద్యను మెరుగ్గా అందించాలని, ప్రభుత్వం త్వరలో చేయనున్న మార్పులకనుగుణంగా అంగన్‌వాడీ కార్యకర్తలు వ్యవహరించాలని ఆత్మకూరు మండల విద్యాశాఖాధికారిణి ఎం.జ్యోతి, ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలతలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఆరు రోజులపాటు ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఎంఈఓ, సీడీపీఓలు జ్యోతి ప్రజ్వలనంగావించి తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో జ్యోతి ప్రసంగిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలను 1,2 తరగతులతో నిర్వహించే ప్రభుత్వ ప్రాధమిక పాఠశాలలకు అనుసంధానం చేసేలా ప్రభుత్వం నిర్ణయిస్తుందని, అందులో భాగంగా ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వం తలపెట్టిన మార్పులకనుగుణంగా చిన్నారులకు పూర్వప్రాధమిక విద్య అందించాలని ఆమె సూచించారు. సిడిపివో సునీలత ప్రసంగిస్తూ ఈ శిక్షణలో పిపి1, పిపి2 విభాగాలుగా ఉంటుందన్నారు. 0-3సంవత్స రాల చిన్నారులకు పిపి1గా, 4-6సంవత్సరాల చిన్నారులు పిపి2గా పరిగణించి ఆయా విభాగాల్లో ఎలాంటి బోధనగావించాలనే నియమావళి ఉంటుందన్నారు. చిన్నారులతో అంగన్‌వాడీ కార్యకర్తలు మమేకంగా ఉంటూ ఆటపాటలతో పూర్వప్రాధమిక విద్య అందించాలని, తల్లిలాగా వారికి చేరువగా ఉండాలని ఆమె సూచించారు. చిన్నారుల హాజరుశాతాన్ని పెంచా లని ఆమె పేర్కొన్నారు. ఈ శిక్షణ 3సంవత్సరాల్లో 120 రోజులపాటు ఉంటుందన్నారు. ప్రథమంగా ఆరు రోజులు శిక్షణా తరగతులు నిర్వహిస్తామ న్నారు. డిఆర్‌పి సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో రీసోర్స్ పర్సన్స్ వెంకటేశ్వర్లు, మస్తానయ్య, రసూల్ తదితరులు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు ఎం.రత్నమ్మ, ఎన్.కేశవనారాయణమ్మ, ఎన్.నాగేశ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు రుణాల ధరఖాస్తు దారులకు ఇంటర్వ్యూలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలో మంజూరైన బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులకు బుధవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీఓ అప్పాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు పట్టణానికి చెందిన దరఖాస్తుదారులు, మద్యాహ్నం 2.30 గంలనుండి అన్నీ గ్రామాల దరఖాస్తుదారులకు జరుగుతాయన్నారు. దరఖాస్తు దారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

**ప్రత్యేక ఆధార్ నమోదుకేంద్రాలను ఉపయోగించుకోవాలి :**

మండలంలోని శకునాలపల్లి, వెంగళరావునగర్, బండగానిపల్లె, జి.చెరుపుపల్లి, నేలటూరు, కృష్ణంపల్లి, అప్పసముద్రం, తిరుమలాపురం, కొండాయపాళెం, ఉదయగిరి బిట్12, 3 గ్రామసచివాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదుకేంద్రాలను ప్రజలు ఉపయోగించుకోవాలని ఎంపీడీఓ అప్పాజీ తెలిపారు. ఈ కేంద్రాలు మంగళవారం నుండి ఈనెల 28వ తేదీవరకు పనిచేస్తాయన్నారు. సచివాలయ సిబ్బంది ఆధార్ క్యాంపులపై ప్రజలకు తెలియజేయాలన్నారు.

# అంగన్‌వాడీలకు జ్ఞాన జ్యోతి శిక్షణ



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** అంగన్వాడీ వర్కర్ల కోసం జ్ఞాన జ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ఇందుకూరుపేట మండలంలో కొత్తూరు జడ్పీహెచ్ఎస్, నర్సాపురం జడ్పీహెచ్ఎస్ స్కూల్స్ నందు జరుగుతున్నవి. ఈ కార్యక్రమంకు డిఆర్పీలుగా స్కూల్ ఎడ్యుకేషన్ నుండి స్కూల్ అసిస్టెంట్లు, ఐసీడీఎస్ సూపర్వైజర్స్ వ్యవహరించారు. ఈసీసీఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలను సమగ్ర అభివృద్ధిని పెంపొందించేలా చేయడంలో అంగన్వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 వెంకటేశ్వరనాయక్, ఎంఈఒ సునీల్, సీడీపీఓ రాజలక్ష్మి, ఎడ్యుకేషనల్ డిపార్ట్మెంట్ నుండి వెంకటేశ్వర్లు, రాజగోపాల్, డిఎస్ కుమార్, ఐసీడీఎస్ సూపర్వైజర్స్ సుబరత్నం, లలితాంబ, జి.మంజుల, శిరీష, స్కూల్ హెడ్మాస్టర్స్, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

# అంగన్‌వాడి టీచర్లకు జ్ఞాన జ్యోతి శిక్షణ



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలంలోని అంగన్వాడీ టీచర్లకు మూడు రోజులపాటు జరిగే జ్ఞాన జ్యోతి మండల స్థాయి శిక్షణా తరగతులను, మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని జడ్పీ ఉన్నత పాఠశాల నందు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు మండల విద్యాశాఖాధికారి-2 డి.సాయి ప్రసాద్ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ శిక్షణా కార్యక్రమం నుద్దేశించి మాట్లాడుతూ.. మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలలో మానసిక, శారీరిక అభివృద్ధిని పెంపొందించుటకు, వివిధ కృత్యాల ద్వారా ఆటపాటలతో ఎలా బోధించాలో ఈ శిక్షణలో రిసోర్స్ పర్సన్స్ తెలియజేస్తారని, ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అంగన్వాడి టీచర్లను కోరారు స్పెల్ వన్‌లో తొలుత మండలంలోని సగం అంగనవాడి కార్యకర్తలకు స్పెల్ టులో మిగిలిన వారికి జ్ఞాన జ్యోతిపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్వైజర్లు తెలిపారు. మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సునీలత కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఐసీడీఎస్ సూపర్వైజర్లు పి.విజయలక్ష్మి, జి,కస్తూరి, మండల రిసోర్స్ పర్సన్లు సుబ్బయ్య, జగదీష్, మండలంలోని అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# ఆచార్య ఎస్.విజయ భాస్కర రావు వీడ్కోలు సభ




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్ ఛాన్సలర్‌గా 7 నెలల పాటు విశేష సేవలందించిన ఆచార్య ఎస్.విజయభాస్కరరావుకి మంగళవారం సాయంత్రం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఘన వీడ్కోలు సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఆచార్య విజయ భాస్కర రావు అందించిన సేవలు అమూల్యమని, ఆయన నేతృత్వంలో విశ్వవిద్యాలయం విద్యార్థుల శ్రేయస్సుకు అనేక కార్యక్రమాలను చేపట్టిందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. విజయ, కావలి కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి.వీరారెడ్డి తదితరులు మాట్లాడుతూ.. ఆయన నాయకత్వంలో విశ్వవిద్యాలయం విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు కృషి చేసిందని, అనేక శ్రేయోమార్గాల్లో అభివృద్ధిని సాధించిందని తెలిపారు. విశ్వవిద్యాలయ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఆయన సేవలను స్మరించుకుంటూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు, సిబ్బంది కలిసి ఆయనకు సన్మానం చేసి, శుభాకాంక్షలు తెలియజేశారు.

# అంగన్‌వాడీలకు జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** అంగన్వాడీలకు జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం మండల విద్యాశాఖ అధికారి-2 తోట శ్రీనివాసులు ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు అంగన్వాడి కార్యకర్తలకు మొదటి విడతగా మూడు రోజులపాటు జరగనున్న జ్ఞాన జ్యోతిశిక్షణ కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశం మూడు నుండి ఆరు సంవత్సరాల విద్యార్థినీ విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించుట, తల్లిదండ్రులకు ఆరోగ్య సంబంధమైన సలహాలు ఇచ్చుట, విద్యార్థులకు క్రమశిక్షణ కూడిన అక్షరాస్యతను నేర్పించుట, విద్యార్థుల శారీరక మానసిక ఆరోగ్యాలను పెంపొందింపజేయుట మొదలగు ఉద్దేశాలతో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, మండలంలోని ప్రతి అంగన్వాడి కార్యకర్త ఈ మొదటి విడత మూడు రోజుల శిక్షణ కార్యక్రమంకు తప్పనిసరిగా హాజరుకావాలని విద్యాశాఖ అధికారి వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంకు రిసోర్స్ పర్సన్స్‌గా జి.సుబ్బారెడ్డి, సారధి, ఫణి రాజ్ ఉపాధ్యాయులను నియమించడం జరిగిందన్నారు.

# బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం కొండ బిట్రగుంట ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని అనంతరం బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని అన్ని శాఖల అధికారులతో మంగళవారం ఆలయ ప్రాంగణంలో కావలి ఆర్డీఓ అధ్యక్షన ఈ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ.. మార్చి నెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహణకు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు విశేషంగా హాజరవుతారని అందుకు తగ్గట్లుగా అన్ని ఏర్పాట్లు చేయవలసిందిగా అధికారులు కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా రవాణా శాఖ, విద్యుత్ శాఖ, పోలీస్ శాఖ, ఫైర్ సిబ్బంది, మున్సిపల్ శాఖ ఆలయ పరిసర ప్రాంతాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచి బ్లీచింగ్, మంచినీటి సరఫరా, చలివేంద్రాల ఏర్పాటు, సైడ్ కాలువలను శుభ్రపరచుట తదితర పనులు చేయాలన్నారు. కోనేరును శుభ్రపరచడంతో పాటు ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ చేయాలని సూచించారు. అదేవిధంగా శానిటేషన్ సిబ్బందిని మూడు షిఫ్టుల్లో ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ శాఖ వారు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుతోపాటు రథోత్సవం రోజున ప్రత్యేక రోప్ పార్టీని ఏర్పాటు చేయాలని సూచించారు. అంతరాయం లేని నిరంతర విద్యుత్ ప్రసారానికి చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. రథోత్సవం జరిగే అన్ని ప్రాంతాల్లో గుంతలు లేకుండా చూడాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. ప్రాథమిక చికిత్సకు అవసరమైన అన్ని మందులతోపాటు ఎండలు ఎక్కువగా ఉన్నందున ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. బ్రహ్మోత్సవాలలో గ్రామ ప్రజలు భాగస్వాములు కావాలని, స్వామి వారి పట్ల ప్రజలు భక్తి శ్రద్ధలతో ఉండాలి. కొండబిట్రగుంట దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో కోటి 65లక్షల రూపాయల వ్యయంతో శ్రీవారి ఆలయ ప్రాకారం, మరో రెండు కోట్ల రూపాయలతో అతిథి గృహాల ఏర్పాటు, దాతల సహకారంతో గాలిగోపుర నిర్మాణాలు, ఆలయ దిగువ భాగంలో కళ్యాణ మండపాలకు శ్రీకారం చుట్టబోతున్నామని తెలిపారు. బిట్రగుంట నుండి కొండ బిట్రగుంట వరకు రోడ్డు మరమత్తులు, ముంగమూరు క్రాస్ రోడ్డు వద్ద నుండి కొండ బిట్రగుంట వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయబోతున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీఓ ఎం.సన్నీ వంశీ క్రిష్ణ, కావలి డీఎస్పీ పి.శ్రీధర్, కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్, ఆలయ ఈఓ రాధాకృష్ణ, మాజీ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, బోగోలు తాసిల్దార్ సురేష్ బాబు, ఎంపీడీఓ సుబ్రమణ్యం, బోగోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, రావి విజయ్ యాదవ్, లేలపల్లి సుధీర్ బాబు, కొట్టుబోయిన బ్రహ్మానందం, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్లకు శిక్షణా తరగతులు



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** చేజర్ల మండలంలోని అంగన్వాడీ టీచర్లకు మూడు రోజులపాటు జరిగే జ్ఞాన జ్యోతి మండల స్థాయి శిక్షణా తరగతులను, చేజర్ల ఉన్నత పాఠశాల యందు మంగళవారం ఉదయం 9 గంటలకు మండల విద్యాశాఖాధికారి-2 డీసీ మస్తానయ్య జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ శిక్షణా కార్యక్రమం నుద్దేశించి మాట్లాడుతూ.. మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలలో మానసిక, శారీరిక అభివృద్ధిని పెంపొందించుటకు, వివిధ కృత్యాల ద్వారా ఆట పాటలతో ఎలా బోధించాలో ఈ శిక్షణలో రిసోర్స్ పర్సన్స్ తెలియజేస్తారని, ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అంగన్వాడి టీచర్లను కోరారు. ఈ కార్యక్రమంలో చేజర్ల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు పి.హైమావతి, ఐసీడీఎస్ సూపర్వైజర్ సీహెచ్ సురేఖ, మండల రిసోర్స్ పర్సన్లు ఎ.సుబ్రహ్మణ్యం, బి.వెంకటేశ్వర్లు, జె.సుధాకర్, మండలంలోని అందరు అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## పారా లీగల్ వాలంటరీ పోస్టుల కోసం దరఖాస్తు చేయండి : న్యాయమూర్తి గీత

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** జిల్లా న్యాయసేవాధికార సంస్థ నెల్లూరు, మండల న్యాయసేవాధికార కమిటీలు గూడూరు, కోవూరు, కావలి, ఆత్మకూరు, వెంటగిరి, కోట, సూళ్లూరుపేట, నాయుడుపేట, ఉదయగిరిలలో పారా లీగల్ వాలంటీర్లుగా (న్యాయసేవ సహాయకులు) పనిచేయుటకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ ఇన్‌చార్జ్ చైర్మన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి జి.గీత ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన వారు ఇంటర్, ఆపైన విద్యార్హత సర్టిఫికెట్లు, రెండు పాస్‌ఫోటోలు, రిజిష్టరుపోస్టు చేయుటకు సెల్ఫ్ అటెస్టెడ్ ఎన్వలాప్ కవర్ రూ.25 స్టాంపులతో జతచేసి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఒక సంవత్సర కాలపరిమితితో భర్తీ అయ్యే ఈ పోస్టులకు ఎపి స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వారు నిర్ధారించిన గౌరవ వేతనాన్ని అందిస్తామని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను 'చైర్మన్ కం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి, డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, న్యాయసేవా సదన్, డిస్ట్రిక్ట్ కోర్టు కాంపౌండ్, నెల్లూరు వారికి రిజిష్టరు పోస్టు ద్వారా మాత్రమే పంపాలని సూచించారు. రిజిష్టరుపోస్టుపై 'అప్లికేషన్ ఫర్ ఎంపానెల్‌మెంట్ ఆఫ్ పారా-లీగల్ వాలంటీర్స్' అని వ్రాయాలన్నారు. ఈ దరఖాస్తులను ఈనెల 26వ తేదీ సా.5 గంటలలోగా తమకు చేరేలా రిజిష్టరు పోస్టు చేయాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఇంటర్వ్యూ ఆధారంగా ఈ ఎంపికలు వుంటాయన్నారు. పూర్తి వివరాలకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించాలని న్యాయమూర్తి సూచించారు. ప్రజలకు చట్టపరంగా న్యాయ సహాయం అందించేందుకు ఆసక్తిగల పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్‌వాడీ సేవకులు, లా డిగ్రీ చదువుతున్న విద్యార్థులు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

## పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలి : ఆర్డీవో



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అన్నీ అర్జీలకు వెంటనే పరిష్కార మార్గం చూపాలని ఆత్మకూరు ఆర్డీఓ బి.పావని అన్నారు. ఆమె మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులు, అర్జీల నివేదికలు పరిశీలించి తహసీల్దార్ సుభద్రకు సూచనలందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మండలంలో రెవెన్యూ సదస్సుల్లో 365 అర్జీలు వచ్చాయని ఇంకా 60 వరకు పరిష్కరించాల్సి ఉందనానరు. వెంటనే సంబంధిత వీఆర్వోకు తెలిపి త్వరగా పరిష్కరిం చాలన్నారు. అర్జీలు పెండింగ్లో వుండకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజలకు అందుబాటులోవుండి మెరుగైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో డీటీ షాజియా తదితరులున్నారు.

# చిన్నారులకు క్షయ వ్యాధి పట్ల అవగాహన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని బిజ్జంపల్లి, జి.చెరువుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల నందు గల బాల బాలికలకు మంగళవారం క్షయ వ్యాధి నివారణ గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విద్యాధికారి కలసపాటి వెంకటసుబ్బయ్య, క్షయ ట్రీట్మెంట్ ఆర్గనైజర్ భోగ్యం వెంకటేశ్వర్లు కలసి మాట్లాడుతూ.. క్షయ వ్యాధి మైకో బ్యాక్టీరియం ట్యూబర్కులై అనే సూక్ష్మ క్రిమి ద్వారా వ్యాపిస్తుందని తెలిపారు. ఈ వ్యాధి గాలి ద్వారా తుంపర్ల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. క్షయ వ్యాధి ఊపిరితిత్తులకు, ఇతర భాగాలకు వ్యాపిస్తుందని తెలిపారు. ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయొచ్చని వ్యాధి లక్షణాలు కనిపించిన వారు గళ్ళ పరీక్ష కొరకు దగ్గరలో ఉన్న పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. వ్యాధిగ్రస్తుల బరువును బట్టి ఆరు నెలల మందులు తీసుకున్న తర్వాత వ్యాధి నయం అవుతుందని తెలిపారు. వ్యాధిగ్రస్తులకు పోషకాహార నిమిత్తం నెలకు 500 రూపాయలు ఇవ్వడం జరుగుతుందని, అదేవిధంగా క్షయ వ్యాధిగ్రస్తులు సంపూర్ణ పోషకహారాన్ని తీసుకోవాలని తెలియజేశారు. పొగాకు వాడటం వల్ల వచ్చే అనర్థాల గురించి ఎన్సీడీ సర్వే ఉపయోగాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాయక్‌బాష, చిరంజీవులు, రోషన్ తాజ్, అక్బర్ బాషా, వి.రమ ణమ్మ, రత్తయ్య, ఆరోగ్య సహాయకులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా

# వాసిపల్లి శంకర్‌రెడ్డి నియామకం



**జలదంకి, మేజర్‌న్యూస్ :** ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జలదంకి మండలం అన్నవరం పంచాయతీ గడ్డవారిపాలెం గ్రామానికి చెందిన వాసిపల్లి శంకర్ రెడ్డిని నియమించారు. ఇటీవల విశాఖపట్నంలోని అంబేద్కర్ భవన్‌లో ఆంధ్ర విద్యార్థి సంఘం (ఏవీఎస్) రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఈ రాష్ట్ర మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుండి విద్యార్థి నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాష్ట్ర మహాసభలకు ముఖ్య అతిథులుగా బ్లైండ్ క్రికెట్ టీం ఫార్మర్ కెప్టెన్ అజయ్ కుమార్ రెడ్డి, ప్రముఖ అనలిస్ట్ కేఎస్ ప్రసాద్, ఆంధ్ర విద్యార్థి సంఘం అడ్వైజర్ రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జ్ బాలకృష్ణలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర మహాసభల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మల్లవరపు అశోక్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వాసుపల్లి శంకర్ రెడ్డిలు నియమాకమయ్యారు. వీరితోపాటు మొత్తం 52మంది రాష్ట్ర కమిటీ నియామకం జరిగింది. రాష్ట్ర మహాసభల్లో విద్యారంగ సమస్యలు, రాష్ట్ర స్థితి, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర, స్వచ్ఛందంగా సమాజంలో సేవ చేస్తున్న యువకులను ప్రోత్సహించడం కోసం మహాసభల్లో శ్రీ పొట్టి శ్రీరాములు యువసేవ పురస్కార్ అవార్డును స్వచ్ఛంద సేవ సమస్త వింగ్స్ ఆఫ్ ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపకులు సాయి మహంతీర్‌కి ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుపల్లి శంకర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కరించడంతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర ఏమిటి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో ఎలా భాగస్వామ్యం అవ్వాలని, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థితిగతుల పైన, రాష్ట్రంలో పీజీ విద్యార్థులకు గుది బండగా మారిన మారిన జీవో నెంబర్ 77, పెండింగ్ ఎలా ఉన్న ఫ్రీజర్ అయంబర్స్మెంట్, ప్రభుత్వ వసతి గృహాల మౌలిక సదుపాయాలు, గ్రాడ్యుయేట్ కంప్లీట్ ఐపోయేలోపు ఉద్యోగానికి సంబంధించినటు వంటి స్కిల్స్ నేర్పించే అంశంతోపాటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యొక్క ప్రాముఖ్యత గురించి ప్రపంచానికి వెలుగెత్తి చాటేలా, రాష్ట్రంలో ఉన్నటువంటి మహా పురుషులను గుర్తు చేసుకుంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆంధ్ర విద్యార్థి సంఘం ఒక బలమైన శక్తిగా తయారయ్యే విధంగా రాష్ట్ర మహాసభల్లో చర్చలు జరిగాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర విద్యార్థి సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తురకా ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు శివ, మనోజ్, కార్తీక్, కావ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు అఖిల్, వంశీ, నాగరాజు, శివ, హనుక్ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# పొదుపు గ్రూపు సభ్యులు, ఆర్థికపరమైన నిర్వహణకి లోకోస్ యాప్

### శిక్షణ సమన్వయకర్త షేక్ ఖాజా మస్తాన్



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** పొదుపు గ్రూపు సభ్యుల వివరాలు, బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించి ఆర్థికపరమైన అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం లోకోస్ యాప్‌ను అమలు చేస్తుందని ఈ యాప్ పట్ల ప్రతి ఒక్కరికి అవగాహనతో ఉండాలని శిక్షణ సమన్వయకర్త షేక్ ఖాజా మస్తాన్ అన్నారు. మంగళవారం ముత్తుకూరు మండలంలోని స్త్రీ శక్తి భవనంలో 39 మంది కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్లు ఈ లోకోస్ యాప్ నిర్వహణపై శిక్షణ పొందారు. మరో రెండు రోజులపాటు జరగనున్న ఈ శిక్షణ కార్యక్రమాల్లో తొలిరోజు కొన్ని అంశాల పైన శిక్షణ పొందారు. ఏరియా కోఆర్డినేటర్ మధుసూదన్ రావు, ఏపీఎం నిర్మల సమక్షంలో శిక్షణ సమన్వయకర్త ఉదయం నుంచి సాయంత్రం వరకు లోకోస్ యాప్ పై శిక్షణ పొందిన వారికి అవగాహన కల్పించారు. యాప్ యొక్క ఉద్దేశం ఏమిటి, అదేవిధంగా నిర్వహణ ఏ విధంగా ఉండాలి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పినట్లుగా లోకోస్ యాప్‌ను ఏ విధంగా ఉపయోగించాలి, ప్రధానంగా ఆర్థికపరమైన అంశాలను ఏ విధంగా నమోదు చేయాలి అనే అంశాలపై సమగ్రంగా శిక్షణ పొందారు. అనంతరం ఏరియా కోఆర్డినేటర్ మాట్లాడారు. దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ శిక్షణ కల్పిస్తుందని తెలియజేశారు. పొదుపు గ్రూపు సభ్యుల వివరాలతో పాటు ఆర్థికపరమైన విధానాలను భద్రపరచుకోవడంలో ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి

● **కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్**

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి నియోజకవర్గంలో ఉన్నటువంటి పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ముత్తుకూరులో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక మండల పార్టీ నాయకులతో కలిసి జిల్లా పార్టీ నాయకులు మాట్లాడారు. పరిశ్రమల కాలుష్యం వల్ల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని అధికారులు చర్యలు తీసుకోవట్లేదని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాలు కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే అభివృద్ధి చెందినయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు సమస్యలను తమకు తెలియజేస్తే రాష్ట్ర పార్టీ నాయకులకు ద్వారా పరిచేస్తామని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.

## ఉర్దూ పాఠశాల తనిఖీ



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజా మొహిద్దీన్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజా మొహిద్దీన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిచడంలో ఉపాధ్యాయులు ముందంజలో ఉండాలని, ఉర్దూ పాఠశాలలో ఎన్రోల్మెంట్ తక్కువగా ఉన్నదని, విద్యార్థుల ఎన్రోల్మెంట్‌ను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల సామర్థ్యలను, స్కూల్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ ఖాదర్‌ను అభినందించారు.

### పొదలకూరు పోలేరమ్మకు వైభవంగా పొంగళ్ళు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలో వెలసి ఉన్న పోలేరమ్మ తల్లికి మంగళవారం పొదలకూరు పంచాయతీ పరిధిలోని చిట్టేపల్లి గ్రామస్తులు పొంగళ్ళ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామం నుంచి సాంప్రదాయబద్ధంగా పొంగలి సామాగ్రి ఉన్న బుట్టను నెత్తిన పెట్టుకొని రెండు కిలోమీటర్ల దూరం ఊరేగింపుగా పొదలకూరు లోని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం సామూహికంగా పొంగళ్ళు తయారుచేసి, ఆ నైవేద్యాన్ని అమ్మవారికి పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. చిట్టేపల్లి పోలేరమ్మ అమ్మగారి ఊరని, ప్రతి ఏటా సంక్రాంతి పండుగ తర్వాత అయిదవ మంగళవారం పొంగళ్లు పెట్టడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. ఈ వేడుకల్లో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సతీమణి జ్యోతి, నెల్లూరు రూరల్ డీఎస్పీ సతీమణి రాధలు పాల్గొన్నారు. వీరికి పూజారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, చిట్టేపల్లి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 20, 21వ తేదీలలో సబ్సిడీ ఋణాల పరిశీలన

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం, కాపు, కమ్మ, రెడ్డి, వైశ్య, ఈబీసీ కార్పొరేషన్స్ ద్వారా సబ్సిడీ ఋణాల కొరకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులు ఈనెల 20, 21వ తేదీలలో బ్యాంకు మేనేజర్ల సమక్షంలో పరిశీలన జరుగుతుందని ఎంపీడీవో ప్రసన్న కుమారి తెలిపారు ఈనెల 20వ తేదిన కొండమీద కొండూరు, కుప్పురుపాడు, పొనుగోడు, దూబగుంట, రాజవోలు, సిబివరం, గుడిపాడు, పెద్దబ్బీపురం, అనుమసముద్రం, ఏ.యస్.పేట, చిరమణ గ్రామ పంచాయతీలు, ఈనెల 21వ తేదిన కావలి యడవల్లి, గుంపర్లపాడు, జమ్మవరం, అక్బరాబాద్ హసనాపురం, శ్రీకొలను గ్రామ పంచాయతీలకు సంబంధించిన సబ్సిడీ ఋణములకు దరఖాస్తు చేసుకున్నవారు ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు బ్యాంక్ మేనేజర్ల సమక్షంలో జరుగు పరిశీలనకు హాజరు కావలసిందిగా ఎంపీడీవో కోరారు.

# శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు వేలం పాట

నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ : శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానం నందు మంగళవారం ఉదయం 2025-26 సంవత్సరంకు వివిధ లైసెన్స్ హక్కులకు ఈ టెండర్/ సీల్డ్ టెండర్ /బహిరంగ వేలం పాటల నిర్వహించడం అయిందని ఆలయ ఈవో తెలిపారు. సదరు టెండర్లు గాలిగోపురం ముందు వైపు పుష్పములు విక్రయించుకొను, ఫ్లెక్స్ బ్యానర్లు ఏర్పాటు చేయుటకు టెండర్లు ఖరారు అయినవని తెలిపారు. కొబ్బరికాయలు పూజా ద్రవ్యములు, కళ్యాణమండపం నందు శుభకార్యకులు నిర్వహించుకొను హక్కు, వస్త్రములు సేకరించు కుని హక్కు సరైన పాట రానందున ఫిబ్రవరి 25 మంగళవారం వాయిదా పడిందని ఆలయ ఇవో తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారిగా పూడిపర్తి గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి ఎన్ శ్రీధర్ నాయుడు, ఆలయ ప్రధాన అర్చకులు ఎన్.రఘురామమూర్తి, ఆలయ సిబ్బంది, టెండర్దారులు, పోలీసు సిబ్బంది ఇతర ప్రజలు పాల్గొనడం జరిగినదని సహాయ కమిషనర్, కార్య నిర్వహణ అధికారి కోవూరు జనార్దన్ రెడ్డి తెలిపినారు.




# పాఠశాలలో మధ్యాహ్నభోజనం నాణ్యంగా సరఫరా చేయాలి

## బిజేపీ అధ్యక్షుడు సంతోష్



ఆత్మకూరు, మేజర్‌న్యూస్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నభోజనం నాణ్యంగా సరఫరా చేసేలా తగు చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు పట్టణ బీజేపీ అధ్యక్షుడు నున్నా సంతోష్ కుమార్ మండల విద్యాశాఖాధికారిణి ఎం.జ్యోతిని కోరారు. ఆత్మకూరు పట్టణంలోని ఏసిఎస్‌ఆర్‌కాలనీ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నభోజనం నాశిరకంగా సరఫరా చేస్తున్నారని విద్యార్థులు ఆందోళన చెందడంతో సమాచారం అందుకున్న ఎంఈఓ జ్యోతి మంగళవారం పాఠశాలలో విచారణ చేపట్టారు. కాగా ఈ సమాచారం అందుకున్న బీజేపీ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ పాఠశాలను సందర్శించారు. అప్పటికే అక్కడ విచారణ జరుపుతున్న ఎంఈఓ జ్యోతితో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు నాశిరకంగా భోజనం సరఫరాచేయడం అత్యంత విచారకరమని, అలా జరుగుకుండేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం సరఫరాచేయాలని అందుకుతగిన సదుపాయాలు సమకూరుస్తుందన్నారు. కానీ నిర్వహకులు నాశిరకంగా సరఫరాచేయడం అత్యంత విచారకరమని సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. విద్యార్థుల ఆందోళన తన దృష్టికిరాగానే విచారిస్తున్నానని, నాణ్యమైన భోజనం సరఫరాచేసేలా చర్యలు తీసుకుంటామని ఎంఈవో జ్యోతి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఏలూరు రామ్‌ప్రసాద్, శ్రీనివాసులు, నాగదాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో రుణదరఖాస్తుదారుల పరిశీలన రేపే : కమీషనర్

ఆత్మకూరు, మేజర్‌న్యూస్ : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో బీసీ, ఈబీసీ, ఈడబ్ల్యూసీ కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడి రుణాలకోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 20వతేదీ ఉదయం తమ కార్యాలయంలో పరిశీలనా కార్యక్రమం ఉంటుందని మున్సిపల్ కమీషనర్ సి.గంగాప్రసాద్ పేర్కొన్నారు. ప్రభుత్వం సబ్సిడితో బ్యాంకులనుండి రుణాలుపొందేందుకు అర్హులు దరఖాస్తులకు నోటిఫికేషన్ జారీచేయగా ఆన్‌లైన్‌లో 350మంది దరఖాస్తు చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఆ దరఖాస్తులను బ్యాంకర్ల ద్వారా పరిశీలించేందుకు 20వతేదీ ఉదయం 10.30గంటలకు దరఖాస్తుదారులు హాజరుకావాలని ఆయన కోరారు. ఎస్‌బిఐ (ఏడిబి), ఎస్‌బిఐ (టౌన్), ఏపిజిబి, కెనరాబ్యాంక్, యూనియన్ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఇండియన్‌బ్యాంక్, జిల్లాకేంద్ర సహకార బ్యాంక్‌ల ప్రతినిధులు హాజరవుతారని కమీషనర్ గంగాప్రసాద్ పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్ దరఖాస్తుఫారం, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, కుల, ఆదాయ సర్టిఫికేట్‌లు, ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ తదితర మార్కుల లిస్టులుతో హాజరుకావాలని గంగాప్రసాద్ పేర్కొన్నారు.





# బుచ్చిలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం

బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ : బుచ్చి పట్టణంలోనివాసవి నగర్లో స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నగర కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి పాల్గొని ప్రతి గడపకు వెళ్లి తడి, పొడి, ప్రమాదకర చెత్త గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టిక్ వద్దు.. కాటన్ సంచి ముద్దు అని నినాదాలు చేశారు.

## ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి




రాపూరు, మేజర్‌న్యూస్ : మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలలో ఫిబ్రవరి 19 నుంచి ఏప్రిల్ 4వరకు ఆయా గ్రామ పంచాయతీలలో నిర్వహించే ఆధార్ క్యాంపులను మండల ప్రజలు సద్విని యోగం చేసుకొనవలసినదిగా మండల అభివృద్ధి అధికారి భవానీ ఒక ప్రకటనలో కోరారు. కొత్త ఆధార్ కార్డులు నమోదు, ఆధార్ కార్డులు అప్డేట్, పేరు, చిరునామా, మొబైల్ నంబర్ లింక్ వంటి సేవలు అందించడం జరుగుతుంది అన్నారు. ఫిబ్రవరి 19 నుంచి 24 వరకు రాపూరు బిట్ 1, 25 నుండి 27 వరకు పంగిలి, 28 నుండి 1 వరకు ఆకిలి వలస మార్చి 3 నుండి 4 గుండవోలు 5 నుంచి 6 వరకు పెనుబర్తి 7 నుంచి 10 వరకు గోనుపల్లి 11 నుంచి 12 వరకు తెగచెర్ల 13, 14, 15 తేదీల్లో సిద్దవరం,17,18 జోరేపల్లి, 19, 20 బొజ్జనపల్లి 21, 22 గిలకపాడు, 23 నుంచి 25 వరకు నెల్లెపల్లి 26, 27న వేపినాపి, 28, 29 సంక్రాంతి పల్లి ఏప్రిల్ 1, 2 కంభాలపల్లి 3, 4 రాపూరు బిట్2 సచివాలయంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

# పొలంపిలుస్తోంది కార్యక్రమం



ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని లేబూరు బిట్-1 గ్రామంలో మండల వ్యవసాయశాఖవారు పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ ఏ.రాజ్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వారు నిర్వహించే రైతు నమోదులో అందరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇలా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి మాత్రమే రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాల వ్యవసాయ శాఖ సబ్సిడీలు అందుతాయని తెలియజేశారు. మండలంలోని వ్యవసాయ శాఖ సిబ్బంది చేత రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రైతులకు వీరు తెలియజేశారు. ఎంపి ఓ.రఘు నాథరెడ్డి మాట్లాడుతూ.. సొంత భూమి కలిగినటువంటి రైతులు ప్రస్తుతం దీనికి అర్హులు. ఇలా రిజిస్ట్రేషన్ అయిన రైతులకు 11 అంకెలతో ఒక రిజిస్ట్రేషన్ నెంబర్ వస్తుందన్నారు. ఈ రిజిస్ట్రేషన్ నెంబర్‌తో భవిష్యత్తులో ఒక రైతు ఐడెంటి కార్డు కూడావస్తుందని తెలియజేశారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో నమోదైన రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు, పంట భీమా, పంట నష్టపరిహారం, సబ్సిడీ విత్తనాలు వంటి పథకాలు అందుతాయి అని తెలియజేశారు. కావున మండలంలోని ప్రతి రైతు వారి గ్రామాల్లోని వ్యవసాయ సిబ్బంది చేత ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామరైతులు, విఏఏ సుమ పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ విషయంలో పారదర్శంగా వ్యవహరించాలి

నెల్లూరు, మేజర్‌న్యూస్ : రెడ్‌క్రాస్ విషయంలో పక్షపాత వైఖరితో కాకుండా, పారదర్శకంగా వ్యవహరించాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ శ్రీ ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రెడ్‌క్రాస్‌లో రాజకీయ జోక్యం ఉండకూడదంటూ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులకు నోటీసులు ఇవ్వడం, వారిని తొలగించడం, తెలుగుదేశం పార్టీ వారికి సంబంధించిన సభ్యులపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడాన్ని ప్రశ్నిస్తూ, జిల్లా కలెక్టర్ చర్యలపై పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, జిల్లా కలెక్టర్ కి బహిరంగ లేఖ ద్వారా విన్నవించారు.




# కరుడుగట్టిన నేరస్తులకు అండగా జగన్ రెడ్డి : జిల్లా టిడిపి నాయకులు

**చిత్తూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో కరుడుగట్టిన వైకాపా నేరస్తులకు మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి అండగా ఉంటున్నారని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ అన్నారు. మంగళవారం చిత్తూరు నగరంలోని స్థానిక టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్‌తో పాటు చిత్తూరు జిల్లా టిడిపి కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు మేషక్‌లు మాట్లాడుతూ ఒక దళితున్ని కిడ్నాప్ చేసి, చిత్రహింసలు గురిచేసిన వల్లభనేని వంశీ అనేటువంటి ఒక కరుడుగట్టిన నేరస్థున్ని ఒక రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్వయాన విజయవాడ జిల్లా జైలుకు వచ్చి ప్రమర్శించడం నేరస్తులను ప్రోత్సహించడం అవుతుందన్నారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీ చేతులో దారుణంగా చిత్రహింసలకు గురైనటువంటి దళితుల్ని పరామర్శించడానికి జగన్మోహన్ రెడ్డి రాకపోవడం దురదృష్టకరం అన్నారు. జగన్మోహన్ రెడ్డి మాట్లాడితే నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అని ఊదరగొట్టడం తప్పించి మరొకటి లేదని, ఒక దళితున్ని కొట్టి చంపి డోర్ డెలివరీ చేసిన అనంతబాబుని వెనకేసుకొచ్చారే కానీ, డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏ రోజైనా పరామర్శించి ఆదుకున్న సందర్భం ఉందా అని, మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేటువంటి వంశీని జగన్ రెడ్డి వెనకేసుకుని వస్తున్నారని, తన హయాంలో జరిగినటువంటి నరమేధాన్ని ,అరాచకాన్ని మరిచిపోయి శ్రీరంగనీతులు వల్లిస్తున్నారని వంశీ గన్నవరం నియోజకవర్గంలో చేసినటువంటి దాడులు, హత్యాయత్నంలు, హత్యలు, ఇసుక స్మగ్లింగ్, అక్రమ గ్రైనేట్ మాఫియా, వీటన్నిటికీ జగన్ రెడ్డి బాధ్యత వహించాల్సిందేనని, తన హయాంలో ఇంత పెద్ద అరాచకాన్ని సృష్టించి రాష్ట్రంలో పేరు మోసినటువంటి క్రిమినల్ గ్యాంగ్ నడిపినటువంటి వ్యక్తి వల్లభనేని వంశీ, అటువంటి వ్యక్తిని పరామర్శించి నేనున్నాను అని భరోసా ఇవ్వడం చూస్తుంటే రానున్న రోజుల్లో జగన్మోహన్ రెడ్డి వ్యూహం ఏదో అర్థమవుతుందని, మాట్లాడితే వైసీపీ కార్యకర్తలు ధైర్యంగా ఉండండి ధైర్యంగా ఉండండి చెబుతూనే తానే రాష్ట్రంలో లేకుండా బెంగళూరులో ఉంటున్నారని, ఇప్పటికైనా జగన్ మోహన్ రెడ్డి తన పందా మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని రా ష్ట్రంలో రెడ్ బుక్ పాలన కేవలం రౌడీలుకి, గూండాలకి, సంఘవిద్రోసక్తులకే వర్తిస్తుందని, మంచివారికి ఎప్పుడు గుడ్ బుక్ పరిపాలన అందిస్తాం అని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో తెలుగు రైతు కార్యదర్శి బాబు నాయుడు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మధు యాదవ్, మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి షబ్బీర్ భాష, సురేష్, రవి తులసి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వృత్తి విద్యా కోర్సులపై అవగాహన కలిగి ఉండాలి



**రొంపిచెర్ల, మేజర్‌న్యూస్:** వృత్తి విద్యా కోర్సులపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని మధ్యప్రదేశ్ రాష్ట్రం, రాయపూర్ పీఎం శ్రీ కార్యాలయ పరిశీలనాధికారి, మదింపు అధికారి అజిత్ మిశ్రా సూచించారు. పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించారు. వృత్తి విద్య - రిటైల్ ప్రాక్టికల్స్ సంబంధించి వివిధ అంశాలపై ప్రధానోపాధ్యాయులు సీహెచ్ మోహన్ రెడ్డి తో చర్చించారు. రెండు రోజుల పాటు 26 మంది పదో తరగతి విద్యార్థుల వృత్తి విద్య సర్టిఫికెట్ లు, విద్యార్థులు తయారు చేసిన ఫోర్ట్ ఫోలియో ప్రదర్శన లను పరిశీలించారు. విద్యార్థులకు వైవా అంశాల ను పరిశీలించి, మదింపు చేశారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్యా ఉపాధ్యాయులు శశి కుమార్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## మేలుము దొడ్డిలో వాటర్ షెడ్ యాత్ర కార్యక్రమం




**పుంగనూరు, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని మేలుదొడ్డి పంచాయతీ మేలుము దొడ్డి గ్రామం నందు పిఎంకె ఎస్ వాటర్ పథకం అభివృద్ధిలో భాగంగా కేంద్ర రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశానుసారం మంగళవారం మేలుము దొడ్డిమైక్రో వాటర్ షెడ్ నందు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లీలా మాధురి మాట్లాడుతూ ప్రతి నీటి బిందువు సంరక్షించినప్పుడు సంపద కలిసి వస్తుంది అన్నారు. వాన నీటి రక్షణ పై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించి క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి వాటర్‌షెడ్ ధనంజయ వర్మ ఎన్.ఆర్.ఇ.జి ఎస్ ఏ పి ఓ శివశంకర్ డిడబ్ల్యూఎంఏ సూపర్ డెంట్ వెంకటరామిరెడ్డి వాటర్ షెడ్ చైర్మన్ ఆర్ రెడ్డప్ప రెడ్డి వాటర్ షెడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సునీత హత్యకు కారణమైన నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి

**- మహిళా సంఘం జయంతి డిమాండ్**

**పలమనేరు మేజర్‌న్యూస్ :** పలమనేరు మండలం టీ వడ్డూరులో మైనర్ బాలికపై పలుమార్లు అత్యాచారం చేసి గర్భవతిని చేసి ప్రాణాలు తీసిన నిండితులను వెంటనే అరెస్ట్ చేసి జైలు పంపించాలి మహిళా సంఘం డిమాండ్ 10 వ తరగతి చదువుతున్న విద్యార్థిని ని పలుమార్లు లైంగికంగా వాడుకొని 9 నెలల గర్భవతిని చేసి రక్త హీనతతో డెలివరీ కావడం కష్టమై చనిపోవడం సభ్య సమాజం సిగ్గుపడేలా వుంది. దీనికి కారుకులైన మంజు నవీన్ హరిత రోజాలను వెంటనే అరెస్ట్ చేయాలని కఠినంగా శిక్షించాలని ఇలాంటి ఘటన జరగకుండా ఉండాలని మహిళా సంఘాలు కోరారు. ఈ గ్రామంలో ఇది కొత్త కాదని ఈ గ్రామంలో ప్రజలు వాపోతున్నారు. రెండుసార్లు గతంలో కూడా ఇలాంటిగతంలో కూడా జరిగినది చోటు చేసుకున్నా ఎవరికి చెప్పుకున్నా న్యాయం జరగలేదని ప్రజలు వాపోతున్నారు. ఇది మూడోసారి ఘటన జరుగుతున్నది ఇంకనైనా మహిళలకు రక్షణ కల్పించాలని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నామని ఆడ పిల్లలు వున్న తల్లి దండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి సునీత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నాము వాళ్లకు వాళ్లకు న్యాయం జరగకపోతే ఉద్యమం చేపడతామని.వెంటనే స్పందించి నిందితులను అరెస్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలి, గ్రామంలో ఇలా జరగడంపై విచారణ జరిపి వాటి ,సునీత కుటుంబాన్ని ఆధుకోవడానికి ప్రభుత్వం తక్షణమే అన్ని చర్యలు చేపట్టాలి. ఆర్ జయంతి మహిళా అధ్యక్షురాలు టౌన్ నుండి గిరిధర్ గుప్తా రాజా సుధాకర్ మహిళా సంఘం ధనమ్మ అమరమ్మ పాల్గొన్నారు.



## శిక్షణ తరగతులతో కళకళలాడుతున్న మహిళ ప్రాంగణం



**తిరుపతి ప్రెస్ క్లబ్,మేజర్ న్యూస్:** స్థానిక తిరుచానూరు రోడ్డులోని నందమూరి తారకరామారావు నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికార కేంద్రం (మహిళా ప్రాంగణం) ఉచితంగా స్వయం ఉపాధి కోసం శిక్షణ తీసుకునే మహిళలతో కళకళలాడుతోంది.చదువుకున్న నిరుద్యోగ మహిళలు,అలాగే చదువు లేని మహిళలకు చేతి వృత్తుల ద్వారా వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ ఫర్జానా ఆధ్వర్యంలో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఈనెల 5వ తేదీ కలెక్టర్ నేతృత్వంలోని "సంకల్ప్"వారి సహకారంతో జనరల్ డ్యూటీ అసిస్టెంట్ ట్రైనీ,ఏడవ తేదీ బ్యూటీ అండ్ వెల్నెస్ కన్సల్టెంట్, పదవ తేదీన ఫ్యాబ్రిక్ కట్టర్ కోర్సులకు మూడు బ్యాచులు ప్రారంభమయ్యాయి.ఒక్కో బ్యాచ్ కు 30 మంది చొప్పున మొత్తం మూడు బ్యాచ్ లకు కలిపి 90 మంది మహిళలు వివిధ కోర్సులకు ఉచితంగా శిక్షణ తీసుకుంటున్నారు. తరగతులు ఉదయం 9-30 నుండి సాయంత్రం 4-30 వరకు మూడు బ్యాచులుగా కొనసాగుతాయి.ఈ కోర్సుల కాల పరిమితి రెండు నెలలు ఉంటుంది.బ్యూటీ అండ్ వెల్నెస్ కన్సల్టెంట్,ఫ్యాబ్రిక్ కట్టర్ కోర్సులను ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్(ఏపీ ఎస్ ఎస్ డిసి) నుండి విచ్చేసిన ప్రతినిధులచే మహిళలకు ఉచితంగా శిక్షణ అందజేస్తారు.ఈ విధంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు స్వయం ఉపాధి పొంది, ఆర్థికంగా ఎదగడానికి ఈ శిక్షణ తరగతులు ఎంతో దోహదపడతాయి. కావున చదువుకున్న నిరుద్యోగ మహిళలు,అలాగే చదువు లేకపోయినా చేతి వృత్తి ద్వారా ఆర్థిక స్వాలంభన పొందడానికి మహిళలందరూ ముందుకు రావాలని మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ ఫర్జానా పిలుపునిచ్చారు.

## విద్యుత్ వినియోగదారులు సోలార్ రూఫ్ టాప్పు నిర్మించుకోండి

**సత్యవేడు, మేజర్‌న్యూస్:** గృహ విద్యుత్ వినియోగదారులందరూ సోలార్ రూపు టాప్పు నిర్మించుకోవాలని తిరుపతి జిల్లా సత్యవేడు ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. మంగళవారం స్థానిక శ్రీశక్తి భవన కార్యాలయంలో వెలుగు ఏపిఎం డాక్టర్ డాంగే యాదవ్ అధ్యక్షతన సంఘమిత్ర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంలో సోలార్ రూఫ్ టాప్పు నిర్మించుకోవచ్చును అన్నారు. వీటిని ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఇందులో భాగంగానే ఒక కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్కు 30 వేలు,రెండు కిలోవాటుకు 60 వేల రూపాయలు, మూడు కిలోవాటుకు 78,000 వేల రూపాయలు ఈ పథకంలో సబ్సిడీ ఉంటుందని ఆయన వివరించారు. ఇంటి పైకప్పులో సోలార్ ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యుత్ బిల్లులు కూడా గణనీయంగా తగ్గించుకోవచ్చు అన్నారు. ఎంఈఓ రవి మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమంలో నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించాలన్నారు అలాగే పాఠశాలలో పిల్లల హాజరు 70 శాతం ఉంటేనే తల్లికి వందనం పథకం వర్తిస్తుందన్నారు. ఉపాధి ఏపీవో కృష్ణయ్య మాట్లాడుతూ ఇంట్లోనే వ్యర్థ జలాలను రోడ్లపైకి వదిలేయకుండా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని కోరారు. ప్రస్తుతం ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణానికి 5500 రూపాయలు మంజూరు చేస్తామన్నారు. వ్యర్థ జలాలను ఇంకుడు గుంతలోకి మళ్లించడం వల్ల పరిసరాలు పరిశుభ్రతతో పాటు దోమలు వృద్ధి చెందే అవకాశాలు లేవన్నారు. ఈ సమావేశంలో వెలుగు కోఆర్డినేటర్లు పయని, శివకుమార్,మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు కోటేశ్వరి, అకౌంటెంట్ కాంచన పలువురు సంఘమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

## అంజుమన్ కమిటీ సమావేశంలో పాల్గొననున్న చల్లా బాబు

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలోని తాజ్ మహల్ సినిమా థియేటర్ వెనుక వైపు ఉన్న అంజుమన్ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించు అంజుమన్ కమిటీ సమావేశమునకు బుధవారం టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి హాజరవుతారని టిడిపి నాయకులు తెలిపారు తెలుగుదేశం పార్టీ నాయకులు కూటమి నాయకులు మైనార్టీనాయకులు అందరూ ఉదయం 10 గంటలకు భగత్ సింగ్ కాలనీ తిరుపతి రోడ్ లోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్ వద్ద హాజరు కావాలన్నారు.

## బాలిక మృతికి కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలి



**పలమనేరు మేజర్‌న్యూస్ :** రూరల్ మండలం టీ ఒడ్డురు గ్రామంలో సునీత అనే బాలికపై అత్యాచారం చేసి గర్భవతై మరణానికి కారణమైన ఉన్మాదులను కఠినంగా శిక్షిం చాలని జాతీయ మానవ హక్కుల అనుబంధ మహిళా సంఘం అధ్యక్షురాలు సరస్వతి డిమాండ్ చేశారు. అందులో భాగంగా మంగళవారం పలమనేరు పట్టణంలో గల మానవ హక్కుల కార్యాలయం నందు రుక్మిణి అధ్యక్షతన జరిగిన సంఘటన పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల జిల్లా నాయకులు డి.వి. మునిరత్నం మాట్లాడుతూ మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి లైంగికంగా వాడుకోవడం వలన 9 నెలలు గర్భవతిని చేయడం దుర్మార్గమన్నారు. బాలికకు వయసు మెచ్యూరిటీ కాకపోవడంతో డెలివరీ అయిన వెంటనే ఎక్కువ రక్తహీనతకు గురై మరణించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో కొంతమంది మధ్యవర్తులు వలన అనేకమంది చిన్నారులు బలైపోతున్నారని తెలిపారు. సునీత విషయంలో కూడా అదే గ్రామానికి చెందిన ఓ మధ్యవర్తి ముఖ్య పాత్ర వహించినట్లు గ్రామస్తులు ద్వారా సమాచారం తెలిసిందన్నారు. శ్రీదేవి మాట్లాడుతూ నిత్యం రెక్కల కష్టంతో బతికే పిల్లల తల్లిదండ్రులు ఆడపిల్లల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణలో ఉండాల్సింది ఎంతైనా ఉందన్నారు . ఆడపిల్లలు క్రమం తప్పకుండా నెలసరి కార్యక్రమం జరుగుతున్నదా లేదా చూడాల్సిన బాధ్యత ప్రతి ఆడబిడ్డ తల్లిపై ఉందన్నారు. కార్యదర్శి మణి, సోమశేఖర్ మాట్లాడుతూ టీ ఒడ్డురు గ్రామంలో ఇంతకు మునుపు ఇలాంటి సంఘటనలు జరిగినట్లు గ్రామస్తులు బహిరంగంగా చెప్పుకోవడం ఆ విషయాల్లో కూడా న్యాయం జరగలేదని వాపోతున్నారు. అప్పుడైనా పిల్లలు తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఎన్ని చట్టాలు వచ్చినా మహిళలు, బాలికలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లితండ్రులు ఆడపిల్లలను ఒంటరిగా ఇళ్ల వద్ద వదలకుండా చదువుపై శ్రద్ధ చూపేటట్లు ప్రయత్నించాలన్నారు. పార్థసారథి,గుర్రం,సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సునీత విషయంలో పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాలిక మృతికి కారణమైన దుర్మార్గులను కఠినంగా శిక్షించే విధంగా సెక్షన్లు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించి బాధ్యత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, మురళి, వెంకటేష్, గంగిరెడ్డి, అరుణ్ పాల్గొన్నారు.

# ఆస్తి పన్ను బకాయిల వసూళ్లను వేగవంతం చేయండి

## - డిప్యూటీ కమిషనర్ చెన్నుడు

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగర పాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్ను, కొళాయి పన్నులు, ఖాళీ స్థలం పన్ను, మున్సిపల్ షాపు రూముల బాడుగల వసూళ్లకై నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేసి వంద శాతం లక్ష్యాలను సాధించాలని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు రెవెన్యూ విభాగం అధికారులు, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. నెల్లూరు నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో కమాండ్ కంట్రోల్ విభాగంలో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. ఎనిమిది సంవత్సరాల పైబడి బకాయి ఉన్న యజమానులను కలిసి బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు వారి నుంచి ఎందుకు వసూలు చేయలేదో సహేతుకమైన కారణాలను వివరిస్తూ నివేదికలను సంబంధిత రెవిన్యూ ఇన్స్‌ఫెక్టర్ ద్వారా కార్యాలయానికి అందజేయాలని ఆదేశించారు. సచివాలయాల పరిధిలో ప్రతి ఒక్క అడ్మిన్ కార్యదర్శి దైనందిన టార్గెట్లను నిర్దేశించుకుని పన్ను వసూళ్లకు సంబంధించిన వివరాలను సంబంధిత ఆర్ఐకి ప్రతిరోజు నివేదికలను తెలియచేయాలని సూచించారు. పన్నుల వసూళ్లకు ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు క్షేత్రస్థాయిలో ఆస్తిపన్ను వసూళ్ల కొరకు పర్యటించాలని సూచించారు. పన్ను బకాయిలు ఉన్న ప్రతి ఒక్క ఆస్తి యజమానికి నోటీసులు జారీ చేసి బకాయిలు రాబట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికంగా అందుబాటులో లేని భవన యజమానులను ఫోన్ ద్వారా సంప్రదించి ఆన్లైన్ పేమెంట్ చేయించేలా తగిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ కార్యాదర్శులకు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లకు సూచించారు. అదేవిధంగా ఈ ఆర్థిక సంవత్సరం మార్చి నెల 31వ తేదీ నాటికి నిర్దేశించిన లక్ష్యాలను



వంద శాతం తప్పనిసరిగా ప్రతి ఒక్కరు వసూలు చేయాలని నిర్దేశించారు. మొండి బకాయిదారులను గుర్తించి మున్సిపల్ చట్ట ప్రకారం వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఇన్స్పెక్టర్లు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మంచు ముసుగు




## ఉదయం వేళల్లో మంచు పరదాతో ప్రజలకు ఇబ్బందులు

**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలం మంగళవారం ఎకువాజాము నుంచి ఉదయం 8 గంటల వరకు మంచు దుప్పట్లోనే ఉంది బారెడు పొద్దెక్కిన మంచు విడకపోవడం విశేషం ఉదయం 9 గంటల తర్వాత పూర్తిగా మంచు తెరలు తొలగి మండలంలో స్పష్టమైన వాతావరణం కనిపించింది. రోజు ఉదయాన్నే ఉన్నప్పటికీ మంగళవారం ఉదయం మాత్రం దట్టమైన మంచు పొగలు మండలాన్ని చుట్టేశాయి. తెల్లవారుజామున ప్రయాణిస్తున్న వాహనాలకు, మంచు పరద కారణంగా రోడ్డు కనిపించక కొంత ఇబ్బందులు పడ్డారు. అలాగే ఉదయం వేళల్లో పొలాలకు వెళ్లే రైతులు, వ్యాయామం కోసం నడక సాగించే ప్రజలకు కూడా ఇబ్బంది కలిగింది. అయితే మంచు పరద కారణంగా ఉదయం 8 గంటల వరకు కూడా సూర్యుడు కనిపించకపోవడం విశేషం.

# లింగ నిర్ధారణ నిషేద చట్టం అమలుపై శిక్షణ

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి, నెల్లూరు జిల్లా వారి కార్యాలయము సమావేశ మందిరము నందు మంగళవారం ఉదయం డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ వి.సుజాత అధ్యక్షతన ఆడ పిల్లల యొక్క ప్రాముఖ్యత, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేద చట్టం (పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్) అమలు పై సంబంధిత కమిటీ సభ్యులకు, స్కానింగ్ కేంద్ర నిర్వాహకులకు, మెడికల్ అసోషియేషన్లకు వివిధ శాఖల అధికారులకు జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ వి.సుజాత మాట్లాడుతూ.. మానవ సమాజ మనుగడలో ఆడ పిల్లల ఆవశ్యకత ఎంతైనా ఉందని, భ్రూణ హత్యలకు ఎటువంటి పరిస్థితులలో పాల్గొనకూడదని, ఆడ పిల్లల ను పుట్టనిద్దం ఎదగనిద్దాం, చదవనిద్దాం అనే అంశాలపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించవలసినదిగా కోరారు.జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేద చట్టం (పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్) పట్టిష్టముగా అమలు చేయటము వల్ల కేంద్ర ప్రభుత్వము విడుదల చేసిన ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5 సర్వేలో పుట్టినప్పుడు లింగ నిష్పత్తి 1000 బాలురకు 1011 బాలికలు, రాష్ట్రంలో జిల్లా నాల్గవ స్థానము లో ఉంది అని అయినప్పటికి జిల్లాలోని స్కానింగ్ సెంటర్లను విస్తృతముగా తనిఖీ చేయుటకు తొమ్మిది మంది జిల్లా ప్రోగ్రాం అధికారులను నియమించినట్లు, వారు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలియజేశారు.ఈ తనిఖీలలో స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు చట్టం




ఉల్లంగణకు పాల్పడినట్లు గుర్తించిన ఎడల చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. తదుపరి, రిసోర్స్ పర్సన్ ఏసిఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.రాగిణి గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేద చట్టం (పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్) నియమ నిబంధనలు చట్టం అమలు తీరు పై పవర్ పాయింట్ ప్రజెంట్ ద్వారా వివరించారు.అల్ట్రా సౌండ్, సిటి స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, ఎకో మరియు'బి' స్కాన్ నిర్వాహకులు ముందస్తుగానే తప్పని సరిగా పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్ క్రింద రిజిస్టర్ చేసుకోవాలని, మెషిన్ల వివరములు మరియు వాటిని ఉపయోగించే వైద్యులు వివరములు డిస్ట్రిక్ట్ అప్రోప్రియేట్ అథారిటీ వారు జారీ చేసిన పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ తో తప్పనిసరిగా సరిపోవలెనని, పరీక్షలు నిర్వహించిన ప్రతి గర్భిణీ స్త్రీ వివరాలను సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫాం-ఎఫ్ లో తప్పనిసరిగా నమోదు చేయవలెనని తెలిపారు. ఇతర స్పెషాలిటీ వైద్యులు సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్ లో 'నిల్' రిపోర్ట్ తప్పనిసరిగా నమోదు చేయవలెనని, పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్ క్రింద గర్భిణీ స్త్రీ వివరాలను నమోదు చేసిన రిజిస్టర్, ఫాం-ఎఫ్‌లు అధికారులు తనిఖీ కొరకు రెండు సంవత్సరాలు భద్రపరచవలెనని తెలియజేశారు. ఈ జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమములో డీఎల్ఏటీఓ డాక్టర్ షేక్‌ఖాదర్ వలి, డీఐఓ డాక్టర్ ఏ.ఉమామహేశ్వరి కమిటీ సభ్యులు ప్రొఫెసర్ (పీడియాట్రిక్) డాక్టర్ సర్దార్ సుల్తానా, గైనకాలజిస్ట్ డాక్టర్ సిహెచ్ కిరణ్, డివిజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.ఎల్ దయాకర్, డీఎస్‌పీకేసీహెచ్ రామారావు, డిప్యూటీ డిఎంహెచ్ఓలు డాక్టర్ బ్రిజిత, రజని, డిఎస్‌సి డబ్ల్యుఈఓ కె.శోభారాణి, ఏఎస్‌డబ్ల్యూఓ కె.హాజరతయ్య, ఎన్‌జి ఓలు జి.కవితరెడ్డి, శ్రీ ఐ.శ్రీనివాసరావు, ప్రైవేట్, ప్రభుత్వ స్కానింగ్ కేంద్ర వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సూర్య
విలేకర్లు కావలెను
తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం, సంగం, కొడవలూరు, వెంకటాచలం,మనుబోలు, అల్లూరు, దగదర్తి, వింజమూరు దుత్తలూరు. నెల్లూరు పట్టణంలో దర్గామిట్ట, స్టోన్‌హౌస్‌పేట, వేదాయపాళెం, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను.
మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు
9000118811, 9963827227

## సింగంశెట్టి అశోక్‌ను పరామర్శించిన పర్వతరెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మెడికవర్ హాస్పిటల్లో అనారోగ్యానికి గురై చికిత్స తీసుకుంటున్న 14 డివిజన్ వైసీపీ నాయకులు సింగంశెట్టి అశోక్‌ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సింగంశెట్టి అశోక్ ఆరోగ్య పరిస్థితి గురించి పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి భరోసానిచ్చారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని చంద్రశేఖర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి వెంట జిల్లా యువజన అధ్యక్షులు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, వైసీపీ నాయకులు గిరిరెడ్డి, సాకేష్ రెడ్డి, మహేష్, సలాం, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

## కాకాణితో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి భేటీ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డిని జిల్లా కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి భేటీ అయ్యారు. సందర్భంగా గోవర్ధన్ రెడ్డితో చంద్రశేఖర్ రెడ్డి పలు రాజకీయ అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు.